

ఓటు వేసిన అనంతరం సిరా చుక్కను చూపిస్తున్న ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్



ఓటుహక్కును వినియోగించుకున్న మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ



ఏకేసీ కాలేజీ వద్ద ఓటు వేసిన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు

ఓటెత్తి.. జైకొట్టి..

ఎవరెక్కడ ఓటు వేశారంటే..

- నగరంలోని వీఎల్‌పురంలో ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- బొమ్మూరు పంచాయతీ ఆవరణలోని పోలింగ్ కేంద్రంలో మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక దంపతులు కుటుంబ సమేతంగా జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.
- నగరంలోని వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలో ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ దంపతులు ఓటు వేశారు.
- సీతంపేట లైబ్రరీ వద్ద కేంద్రంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీకాకుళం శివరామ సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులతో ఓటు వేశారు.
- ఏకేసీ స్కూల్ వద్ద పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

- ఉత్సాహంగా పోలింగ్
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- తరలివచ్చిన వృద్ధులు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు









ఓటుహక్కును వినియోగించుకున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్, శివరామ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 237 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు పారదర్శకంగా నిర్వహించారు. కొన్ని పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 6 గంటలకు ఓటింగ్ పూర్తి కాకపోవడంతో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ పరిధిని 20 సెక్టార్లుగా విభజించి 90 లొకేషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో 237 పోలింగ్ కేంద్రాలలో 2,67,484 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 1,38,194 మంది, పురుషులు 1,28,287 మంది, ఇతరులు 57 మంది ఉన్నారు. అయితే రాత్రి 9.30 గంటల వరకూ జరిగిన పోలింగ్‌లో 1,76,419 మంది ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటి వరకూ 65.95 శాతం పోలింగ్ నమోదైందని సిటీ రిటర్నింగ్ అధికారి కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం 1,530 మంది సిబ్బంది, 88 మంది మైక్రో అబ్జర్వర్లు, మూడు సర్వైవల్ బృందాలు, పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించారు. 237 పోలింగ్ కేంద్రాలలో 79 సమస్యాత్మకంగా గుర్తించి ప్రత్యేక భద్రత, రక్షణ చర్యలు చేపట్టామన్నారు. ఓటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 3 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు, 3 వీడియో చిత్రీకరణ బృందాలను ఏర్పాటు చేశారు. 237 పోలింగ్ కేంద్రాలలోనూ వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ వీఎల్‌పురంలో ఓటును వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక దంపతులు కుటుంబ సమేతంగా జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. అనంతరం పోలింగ్ బూత్ వెలుపల తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికలలో ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఉమా రామలింగేశ్వర కల్యాణ మంటపంలో కమిషనర్ దినేష్ కుమార్ ఓటు వేశారు.

రూరల్ నియోజకవర్గంలో..

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ బూత్‌లలో వాగ్వాదాల మినహా ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. యువత సైతం ఉత్సాహంగా తరలివచ్చింది. ధవళేశ్వరం కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో రాత్రి ఏడు గంటల వరకు, ఎర్రకొండ డబ్బా ట్యాంకుల వద్ద ఎంపీపీ పాఠశాలలో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది. కడియం మండలం వెంకాయమ్మపేటలో రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుండగా, ఇంకా 232 మంది ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. రాత్రి 9 గంటలకు 75.24 శాతం పోలింగ్ శాతం నమోదైంది. ఇంకా కొన్నిచోట్ల పోలింగ్ కొనసాగుతోంది.

విజయం ఖాయం : మంత్రి వేణు

బొమ్మూరు గ్రామపంచాయతీ ఆవరణలోని పోలింగ్ కేంద్రంలో మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పలు బూత్‌లలో ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఉదయం నుంచే ఓటేసేందుకు బారుల తీరడం జరిగిందన్నారు. పోలింగ్ శాతం పెరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. రూరల్ నియోజకవర్గంలో విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.



ఏకేసీ కాలేజీ వద్ద బారులు తీరిన ఓటర్లు

కడియం మండలంలో..

కడియం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు సోమవారం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ప్రారంభమైన తొలి గంటలో కేవలం 12 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఆ తరువాత నుంచి పెరుగుతూ వచ్చింది. మహిళలు, యువత కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో బారులు తీరారు. పొట్టిలంక, బుర్రిలంక తదితరచోట్ల స్వల్ప వాగ్వాదాల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిర్ణీత సమయం ముగిసే కడియపులంక, కడియపుసావరం, జేగురుపాడు తదితర పంచాయతీల్లోని పలు బూత్‌ల వద్ద వందల సంఖ్యలోనే ఓటర్లు ఇంకా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేచి చూస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్లు మూసి వేశారు. కడియం ఎస్సీపేట స్కూలు వద్దకు ఆ తరువాత వచ్చిన ఓటర్లను లోపలకు అనుమతించలేదు. మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు తదితర ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనారోగ్యంతో మంచంపై ఉన్న వృద్ధులను కూడా పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చారు. ఉద్యోగ, వ్యాపారం రీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం సొంతూర్లకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచారు.

రాత్రయినా వేచిఉన్న ఓటర్లు

కడియపులంక పంచాయతీ పరిధిలోని 214 నంబర్ బూత్‌లో 282 మంది, 217 బూత్‌లో 130 మంది, 222లో 144 మంది, 218లో 100 మంది, కడియం హైస్కూల్లో 60 మంది, 203లో 80 మంది ఓటర్లు ఇంకా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాత్రి ఎనిమిదిన్నరకు కూడా వేచి ఉన్నారు. దుళ్ల బూత్ 244, కడియం 199లలో మాక్ పోలింగ్ ఆలస్యం కావడంతో, అసలు పోలింగ్ సుమారు అరగంటకుపైగా ఆలస్యంగా ప్రారంభించారు. బుర్రిలంక 217లో ఈవీఎం స్విచ్ సరిగా పనిచేయడం లేదని గుర్తించారు. దీంతో దానిని మార్చు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు 20 నిమిషాలు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఆ తరువాత ప్రారంభించడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కడియం, కడియపులంక, వెంకాయమ్మపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పోలీసు పరిశీలకులు రవిప్రకాష్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కడియం, కడియపులంక, పొట్టిలంక తదితర గ్రామాల్లో పోలింగ్ సరళిని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎండ తీవ్రత కారణంగా ఉదయమే పోలింగ్ బూత్‌ల వద్దకు పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. దీంతో భారీ స్థాయిలో క్యూలు ఏర్పడ్డాయి. తిరిగి సాయంత్రం 4 గంటలు దాటాక పోలింగ్ బూత్‌ల వద్ద రద్దీ పెరిగింది. ధవళేశ్వరంలో పోలింగ్ బూత్‌ల వద్ద రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరిగింది. మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పోలింగ్ సరళిని పరిశీలించారు. ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద శతాధిక వృద్ధురాలు నేతల గ్రేసమ్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్, ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్ మోహన్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



పిడింగొయ్యిలో ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు



జాంపేట లూథరన్ హైస్కూల్ కేంద్రానికి వృద్ధుడిని వీల్ చైర్‌లో తీసుకువెళుతున్న పోలింగ్ సిబ్బంది



సుబ్బారావు పేట మున్సిపల్ హైస్కూల్ వద్ద ఓటు వేసిన హిజ్రాలు



వేమగిరిలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు





కడియంలో దివ్యాంగ ఓటర్‌కు సాయం చేస్తున్న పోలీసులు, నెహ్రూ నగర్ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు



వేమగిరిలో క్యూలో వేచిఉన్న ఓటర్లు

నన్నయ స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు



నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను తరలించారు. సోమవారం రాత్రి పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలకు భద్రంగా సీల్ వేసి బస్సులలో స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకువచ్చారు. వాటిని ప్రత్యేక గదులలో భద్రపరిచారు.

- రాజమహేంద్రవరం రూరల్

ఓపీఓ తీరుపై ఓటర్ల ఆగ్రహం

- ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించాడంటూ అభియోగం
- ఓపీఓను విధుల నుంచి తొలగించిన అధికారులు

రావులపాలెం: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాల్సిన ఎన్నికల విధుల్లో ఉండే పోలింగ్ అధికారులు ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు. అధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కేంద్రంలో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ హైస్కూల్లో 64వ బూత్‌లో ఓపీఓగా విధులు నిర్వహించేందుకు వచ్చిన మలికిపురం మండలానికి చెందిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి.రాజీవ్ సోమవారం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లకు సిరాను వేలుపై పెట్టేందుకు విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో టేబుల్‌పై కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న ఒక ప్రముఖ పత్రికను (సాక్షి కాదు) కింద వేసుకుని సిర వేసే సమయంలో కూటమి పార్టీకి ఓటు వేయాలంటూ ఆ యాడ్‌ను చూపిస్తున్నాడని స్థానిక ఓటర్లు అభ్యంతర వ్యక్తం చేశారు. అతడితో వాగ్వాదానికి దిగడంతో కొంతసేపు ఆ కేంద్రంలో పోలింగ్ నిలిచిపోయింది. దీంతో రావులపాలెం తహసీల్దారు, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఓపీఓ రాజీవ్ అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలింగ్ తిరిగి కొనసాగింది. అయితే ఎన్నికల సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రావులపాలెం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మను వివరణ కోరగా గొడవ జరుగుతున్నట్లు సమాచార రావడంతో అక్కడికి చేరుకుని విచారించామన్నారు. అయితే ఈనాడు పత్రికలో వచ్చిన కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న పేపర్ ను కింద వేసుకుని సిరాను పెట్టడంతో అతను ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించాడని స్థానికులు అభియోగించారన్నారు. దీంతో అక్కడ ఏ విధమైన గొడవలు జరగకుండా ఉండేలా పోలీస్ శాఖ వారు అతన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. అయితే అతనిపై చర్యలు తీసుకునే అధికారం ఆ పోలింగ్ బూత్ పీఓకు ఉందని పీఓ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.



కూటమి యాడ్ ఉన్న ఈనాడు పేపరుతో పోలింగ్ కేంద్రంలో కూర్చొన్న ఓపీఓ రాజీవ్

ఎన్నికల నిబంధనలకు పాతర

మధురపూడి: ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఓటర్లను ఓటు వేయమని అభ్యర్థించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కోరుకొండ మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నిడిగట్ల, కోటి, నర్సాపురం, గాదరాడ, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు. ఉదయం పోలింగ్‌కు తక్కువగా వెళ్లిన ఓటర్లు, మధ్యాహ్నానికి పోటెత్తారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. కోరుకొండ మండలంలో 65,439 మంది ఓటర్లలో సాయంత్రం 6 గంటలకు 70 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ బూత్‌ల వద్ద అభ్యర్థులు ప్రచారం చేయరాదు. ఇందుకు విరుద్ధంగా బూరుగుపూడిలోని పోలింగ్ కేంద్రంలో బత్తుల బలరామకృష్ణ క్యూలో ఉన్న ఓటర్లను ఓటు వేయమని అభ్యర్థించారు. పోలింగ్ సమయం పూర్తయ్యాక సాయంత్రం 6 గంటలకు శ్రీరంగపట్నం బూత్‌లోకి నలుగురు వ్యక్తులను తీసుకువెళ్లారు.



బూరుగుపూడిలోని పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను అభ్యర్థిస్తున్న జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ